# త్యాగనిరతి



Eid-e-Qurbani (Telugu)

# త్యాగనిరతి

మూలం

మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూదీ (రహ్మాలై)

అనువాదం

ఇఖ్బాల్ అహ్మద్

తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్
సందేశభవనం, లక్కడ్‌కోట్,
హైదరాబాద్-500 002.

**Tyaganirati**

**Eid-e-Qurbani (Telugu)**

**TIP Series No.** : **199**

Written by : Moulana Syed Abul A'ala Moududi

Translated by : Iqbal Ahmed

All Rights Reserved with Publishers

Second Edition : November 2018

Copies : 2000

**Price** : **Rs. 15**

ISBN : 81-88241-97-0

Published by : Telugu Islamic Publications Trust (Regd.)
Sandesha Bhavanam,
Lakkadkot, Chatta Bazar,
Hyderabad-500 002. India.
Phone: 24564583
Fax : +91 +040 + 24576237
e-mail: tiphyderabad@rediffmail.com

Typeset by : Geeturai Graphics
Lakkadkot, Hyderabad-2.

Printed at : : Cosmic Printers
Lakkadkot, Hyderabad-2.

అనంత కరుణామయుడు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

# ఖుర్బానీ

నేటికి నాలుగువేళ ఏళ్ళ క్రిందటి విషయం. ఇరాక్ భూభాగంలో ఒక వ్యక్తి జన్మించాడు. ఆయన మానవ చరిత్రలో ఒక శాశ్వత ముద్రను విడిచి వెళ్ళాడు. ఆయన కళ్ళు తెరిచినకాలంలో ప్రపంచం యావత్తూ బహుదైవారాధన (షిర్క్), విగ్రహారాధనలో మునిగివుంది. ఆయన జన్మించిన వంశం నక్షత్రాల పూజారులు. సూర్యచంద్రులు, ఇంకా ఇతర గ్రహాలు ఆ జాతి దైవాలు. రాచకుటుంబం ఈ దేవతల సంతానమే అన్నది వారి విశ్వాసం. దేశప్రజలకు ఆ కుటుంబమే ప్రభువు, దైవాంశ సంభూతులుగా భావించేలాచేసింది. ఆయన జన్మించిన కుటుంబం పురోహితుల వంశం. తమ జాతివారిని నక్షత్రాల పూజల వలయంలో చిక్కుబడిందనటానికి అసలు బాధ్యురాలు ఈ వంశంవారే.

అటువంటి కాలంలో అటువంటి జాతి, అటువంటి వంశంలో ఈ వ్యక్తి జన్మించాడు. ప్రపంచ పోకడను అనుసరిస్తూ తానూ వారిలో ఒకడుగా అయివుంటే తన వంశంవారు, తన దేశ ప్రజలు, తన కాలంలోని వారూ నడుస్తున్న మార్గాన్నే అనుసరించి ఉండేవాడు. మరో మార్గంవైపు మార్గదర్శనం చేయించే వెలుగు ఏదీ కూడా ప్రత్యక్షంగా అప్పటి ప్రపంచంలో ఎక్కడా ఉండి ఉండలేదు. ఇంకా తన వ్యక్తిగత, కుటుంబ ప్రయోజనాల కారణంగా మరే మార్గం గురించి ఆలోచనా మాత్రంగానయినా తన మనసులోకి రానిచ్చేవాడు కాదు. ఎందుకంటే తన వంశంవారి మత దుకాణం నక్షత్రాల పూజపేరున

బాగా జోరుగా సాగుతుంది. కాని అతడు గాలి ఎటువీస్తే అటు ఎగిరే గడ్డిపరక ల్లాంటి వాడు కాదు. అతడు వంశపారంపర్యత కారణంగా తాత ముత్తాతలు మరియు జాతి విధానాలను కిమ్మనకుండా అంగీకరించడానికి సిద్ధపడలేదు. అతడు జ్ఞానవంతుడయినప్పటి నుండే, ఏ విశ్వాసాలు, సూత్రాలపై తన పెద్దలు, జాతి ప్రజలు తమ జీవన విధానానికి పునాది నిర్మించుకున్నారో అది సరయినదా కాదా అని పరిశోధించడం అవసరం అని భావించాడు. ఈ స్వేచ్ఛాయుత పరిశోధనల విషయంలో అతడు సూర్యచంద్రులు, నక్షత్రాలు మరియు తాను బాల్యం నుండే వింటూవచ్చిన వారి దైవత్వానికి సంబంధించిన ప్రస్తావనల్ని దృష్టిలో పెట్టుకుని ఆలోచింపసాగాడు. ఒక్కొక్క దాన్నీ అవి దైవాలన్న విషయం ఎంతవరకు నిజమో అని పరిశీలించి చూశాడు. చివరకు ఇవన్నీ దైవాజ్ఞను పాటించేవేననీ, భూమి ఆకాశాల సృష్టికర్త ఒక్కడిదే ఈ దైవత్వం అన్న నిర్దిష్ట అభిప్రాయం ఏర్పర్చుకున్నాడు. ఒక విషయాన్ని సత్యం అని తెలుసుకొని, అంగీకరించినప్పటికీ దానిని స్వీకరించడానికి తిరస్కరించే వారి ధోరణిని అవలంబించలేదు. అతడు సత్యాన్ని సత్యం అని తెలుసుకున్న తరువాత దాన్ని అంగీకరించడంలో ఒక్క క్షణం కూడా జాగు చెయ్యలేదు. వెంటనే అంగీకరించాడు. "భూమ్యాకాశాల ప్రభువు ఎదుట నేను తలవాల్చాను" ఈ ఒప్పుకోలు తర్వాత తన కుటుంబం, వంశం మరియు జాతి ఎదుట "నా మార్గం మీ మార్గంకన్నా భిన్నమయినది, నేను ఈ బహుదైవారాధన విగ్రహారాధనలు చేసే మీ వెంట నడువను" అంటూ ప్రకటించాడు. ఇది ఈ వ్యక్తి చేసిన మొదటి ఖుర్బానీ (త్యాగం). ఇది తాతముత్తాతల అంధానుసరణపై, వంశ, జాతి ఆచారాలపై మానసిక బలహీనతలన్నింటిపై వేసిన మొదటి వేటు. వాటికారణంగా మనిషి తన అంతరాత్మ ప్రబోధానికి వ్యతిరేకంగా ఒక వంశ, జాతి ప్రజలంతా ఒక మార్గంపై నడుస్తున్నారన్న కారణంగానే అదేబాటపై నడుస్తాడు.

ఈ నిర్ణయాన్ని ప్రకటించాక అతడు అంతటితో ఊరుకోలేదు. షిర్క్

(బహుదైవారాధన) నిరాధారమయిన పని అని సృష్టి అసలు దేవుని ఏకత్వంపై ఆధారపడిందన్న వాస్తవం అతనిముందు నిలిచింది. ఈ వాస్తవాన్ని ఎరిగిన తర్వాత ఆ మానవులంతా తౌహీద్(దైవ ఏకత్వం) బదులు షిర్క్ విశ్వాసాల్ని, షిర్క్‌తోకూడిన సిద్ధాంతాలపై తమ మత, నైతిక, సాంస్కృతిక భవనాన్ని నిర్మించు కున్నారని నిజానికి వారు ఒక బలహీనమైన కొమ్మలపై గూడు నిర్మించుకున్నారని అది అశాశ్వతం అన్న విషయం కూడా అతడు గ్రహించాడు. జాతివారి ఈ బలహీన భావన అతడికి ఆందోళన కలిగించింది. తన జాతిని షిర్క్‌నుండి ఆపాలని, ఏకేశ్వరోపాసన వైపు ఆహ్వానించాలన్న బాధ్యతాభావంతో నడుం బిగించాడు. జాతీయ మతానికి వ్యతిరేకంగా ఇటువంటి బహిరంగ ప్రచారం చేసి తాను పౌరోహిత్యపు గద్దెను కోల్పోవాల్సి వస్తుందని అతడికి తెలుసు. అతడి వంశం జాతీయ మతంనుండి మరలిపోయినట్లయితే ఆ వంశానికి దేశంలోగల రాచరిక హోదా అంతం అయిపోతుందని కూడా అతడికి తెలుసు. ఈ ప్రచారం కారణంగా జాతి యావత్తూ కోపోద్రిక్తమైపోతుందన్న విషయమూ తెలుసు. ఈ ప్రచారం కారణంగా ప్రభుత్వం అతడ్ని ఇక్కట్లు పాలుచేస్తుందన్న విషయాన్ని అతడు విస్మరించలేదు. ఎందుకంటే రాచకుటుంబ అధికారానికి పునాది, తాము దేవతల సంతానం అన్న విశ్వాసమే గనుక. ఈ కారణంగా అయితే తప్పనిసరిగా ప్రభుత్వ ప్రాథమిక సిద్ధాంతంతో విభేదిస్తుంది. ఇదంతా తెలిసికూడా అతడు తన విధిని నిర్వహించటానికి సిద్ధపడ్డాడు. తన తండ్రిని, తన వంశాన్ని, తన జాతినీ చివరకు చక్రవర్తిని కూడా షిర్క్‌ను మానుకోవాలని, తౌహీద్ విశ్వాసాన్ని స్వీకరించవలసిందిగా పిలుపునిచ్చాడు. అతనిపట్ల వ్యతిరేకత ఎంతగా పెరుగుతూ పోయిందో అంతే ఎక్కువగా అతడి కార్యనిమగ్నత పెరు గుతూ పోయింది. చివరకు పరిస్థితి ఎలా అయ్యిందంటే ఒకవైపు ఆయన ఏకాకి, ఒంటరివాడు. మరోవైపు అతనికి వ్యతిరేకంగా బాదుషా, దేశం, జాతి, కుటుంబం, చివరకు కన్న తండ్రికూడా అతడ్ని వ్యతిరేకించారు. దేశం మొత్తమ్మీద

అతని మిత్రుడు అంటూ ఎవరూ లేరు. ఎటుచూసినా శత్రువులే శత్రువులు. అతడిని సమర్థించే ఒక్క వాణి అయినా లేకపోయింది. అయినా అతడు ధైర్యాన్ని కోల్పోలేదు. తౌహీద్ పిలుపును ఇవ్వడంలో అతడి నోరు శుష్కించలేదు. అందుచేత అతడ్ని బహిరంగంగా సజీవంగా కాల్చిచంపాలని నిర్ణయించబడింది. ఇటువంటి భయంకర శిక్ష కూడా అతడ్ని అధర్మాన్ని అధర్మంగా సత్యాన్ని సత్యంగా పలకడం నుండి దూరం చెయ్యలేక పోయింది. అతడు అగ్నిగుండంలో విసరి వేయబడటాన్ని సహించాడు తప్ప తాను విశ్వసించిన వాస్తవం నుండి మరలిపోవడాన్ని సత్యం పలకడాన్ని మానుకోవడం సహించలేకపొయ్యాడు. ఇది అతడి మరో గొప్ప ఖుర్బానీ.

దైవం అతన్ని అగ్నిజ్వాలల్లో మాడిపోవడాన్నుండి ఎలా రక్షించాడో తెలియదు. ఈ ప్రమాదం నుండి సురక్షితంగా బయటపడిన తర్వాత అతడు దేశంలో నిలవడం అసాధ్యం అయిపోయింది. చివరకు అతడు దేశదిమ్మర జీవితం అవలంబించాడు. చుట్టుప్రక్కల అతడు పోగల దేశాలలో విగ్రహారా ధకులు. అతడు ఆశ్రయం పొందటానికి ప్రశాంత జీవితం గడపడానికి వీలయ్యే తౌహీద్‌ను సమర్థించే ఏ చిన్న సమాజంగానీ, వర్గంగానీ లేకపోయింది. ఈ పరిస్థితులలో ప్రశాంతత పొందడానికి గల ఏకైక మార్గం అతడు తన దేశం వదిలిన తరువాత తౌహీద్ ప్రచారం మానుకోవటమే. వ్యక్తిగతంగా ఒక అపరిచి తుడు ఏదయినా మతావలంబీకుడు అయినప్పుడు ఇతర దేశాల వారు అనవసరంగా అతడ్ని రెచ్చగొట్టేందుకు ఎందుకు శ్రమపడతారు? పైగా వారికి ఇతడి మతం ఏమిటో తెలిసికోవడానికే అవకాశంలేదు. కాని ఆ దైవదాసుడు ఇతర దేశాలకు వెళ్ళి కూడా ఊరికే ఉండిపోలేదు. అతడు వెళ్ళిన ప్రతిచోటా అక్కడి దైవదాసులకు ఇతరుల దాస్యాన్ని వదిలి, మీ నిజప్రభువుకే దాసులుగా జీవించండి అన్న సందేశాన్నిచ్చాడు. ఈ ప్రచారం ఫలితంగా తన దేశాన్ని వదిలి పెట్టినా అతడికి ప్రశాంతంగా కూర్చునే భాగ్యం దక్కలేదు. ఒకసారి సిరియాలో

ఉంటే మరోసారి పాలస్తీనాలో, ఒకప్పుడు ఈజిప్టులో ఉంటే మరొకప్పుడు హిజాజ్‌లో, అలా దేశదేశాలు తిరగటంలోనే అతడి వయసు గడిచిపోయింది. అతడికి విశ్రాంతిగా కూర్చోవాలన్న తలంపులేదు. అతడికి ఇల్లు, పొలం, పశువులు, వ్యాపారాలపై ధ్యాసలేదు. అతడికి ప్రాపంచిక సుఖాలు, జీవితంలో కావలసిన వస్తు సముదాయం పట్ల ఆపేక్ష లేదు. అతడికి కావలసిందల్లా ఏ సత్యాన్నయితే తాను విశ్వసించాడో దాని కలిమా ఉన్నతం కావాలి. మానవులంతా అజ్ఞానాన్ని వదిలి సన్మార్గంపై నడవసాగాలి. అందులోనే వారి శ్రేయస్సు ఉంది. ఈ కోరిక అతడ్ని అన్నిచోట్ల వెంటాడింది. అతడి ప్రతి ప్రయోజనాన్నీ అర్థింపచేసింది. ఇది అతడి మూడవ ఖుర్బానీ.

ఈ సంచార జీవితంలో, ఒనరుల రాహిత్యంలో తిరుగుతూ తిరుగాడుతూ వయస్సు మళ్ళిపోసాగినప్పుడు దైవం ఆయనకు ఒక కుమారుడ్ని ఇచ్చాడు. ఆ పిల్లవాడ్ని పెంచిపెద్దచేశాడు. సంతానం తల్లిదండ్రులకు చేదోడువాదోడు అయ్యే జీవిత పయనంలో వారికి సహకరించే దశకు చేరుకున్నాడు ఆ కుమారుడు. కుమారుడు, అదీ ఏకైక కుమారుడు ఇంకా యవ్వనదశకు చేరుకున్నవాడు. మరి తండ్రి, అటువంటి సంతానం అండదండలు అవసరం అయిన దశలో ఉన్నాడు. ఈ పరిస్థితిని ఊహించిన ప్రతివాడూ ఈ తండ్రికి ఆ కుమారుడు ఎంత ప్రియతముడో అంచనా వేయగలడు. కాని ఒక ముస్లింకు అతడి దైవం, దైవాభీష్టం కన్నా మించిన వస్తువు మరోటి లేదు. అందుచేత ఈ దాసుడు తన జీవితకాలం మొత్తంలో తన ప్రభువు కోసం చేస్తూవచ్చిన త్యాగాలన్నీ సరిపోవని, వాటన్నింటి తర్వాత చివరి పరీక్ష తీసుకోవడం అవసరం అని భావించబడింది. ముస్లిం అయిన ఈ దాసుడు తన ప్రియతమ కుమారుడిపై గల ప్రేమను కూడా దైవం కోసం త్యాగం చెయ్యగలడా? లేదా? కనుక ఈ పరీక్ష కూడా తీసుకోబడింది. వృద్ధుడయిన ఆ మానవుడు తన ప్రభువు స్పష్టమయిన ఆదేశం కాకపోయినా కేవలం ఒక్క సూచనతోనే

యువకుడయిన ఏకైక కుమారుడ్ని స్వయంగా తన చేతులతో జిబహ్ చేయడానికి సిద్ధపడ్డాడు. సరిగ్గా అదే సమయానికి కుమారుడి స్థానంలో పొట్టేలును స్వీకరించాడన్నది వేరే విషయం. ఎందుకంటే దైవానికి కావలసింది కుమారుడి రక్తంకాదు. కేవలం తండ్రి ప్రేమకు పరీక్ష మాత్రమే అందులోని ఉద్దేశ్యం. కాని ఆ సత్యవంతుడయిన ముస్లిం తన సంకల్పం వరకు అయితే ప్రాణసమానుడైన తన కుమారుడ్ని దైవసూచనపై త్యాగం చేయనేచేశాడు. ఆ వ్యక్తి తన ఇస్లాం, విశ్వాసం, దైవం పట్ల తన విశ్వసనీయతను నిరూపించు కునేందుకు సమర్పించుకున్న చిట్టచివరిదీ, అన్నింటికన్నా పెద్దదీ ఖుర్బానీ.

ఇది ఏ వ్యక్తికి సంబంధించిన ప్రస్తావనో అనుకుంటున్నారు గదూ! ఈనాడు మనం అందరం హజ్రత్ ఇబ్రాహీం(అలై) పేరుతో తెలిసిన వ్యక్తి ప్రస్తావన ఇది. ఈనాడు ప్రపంచ వ్యాప్తంగా ముస్లింలు జంతువులను ఖుర్బానీ ఇచ్చి జరిపే ఖుర్బానీ ఇదే. ఈ జ్ఞాపికను జరపడంలోని ఉద్దేశ్యం, ముస్లింలలో ఖుర్బానీ స్పిరిట్ ఉండాలని. ఈమాన్, ఇస్లాంలో అదేవిధమయిన దైవం పట్ల విశ్వాస పాత్రత, ప్రేమలలో అదే గొప్పతనం జనించాలని, దేన్నయితే హజ్రత్ ఇబ్రాహీం(అలై) తన పూర్తి జీవితంలో చేశారో, ఒక వ్యక్తి గనక ఒక జంతువు మీద కత్తిని ప్రయోగిస్తుంటే అతడి హృదయం అటువంటి స్పిరిట్ లేనిదయితే అతడు అధర్మంగా ఒక జంతువు రక్తం చిందిస్తున్నాడు అన్నమాట. దైవానికి దాని రక్తం, మాంసం అక్కరలేదు. ఇక్కడ కావలసింది, కలిమ లా యిలాహ ఇల్లల్లాహ్‌ను విశ్వసించిన వ్యక్తి సంపూర్ణంగా దైవదాసుడు అయిపోవాలి, ఎటువంటి స్వంత లాభం, ఆసక్తి, స్వీయప్రయోజనం ఒత్తిడి, పేరాశ, ఇంకా ఏదయినా భయం, నష్టం మొత్తమ్మీద ఏదయినా అంతర్గత బలహీనత, బాహ్యాపరమైన శక్తి అతడ్ని సత్యమార్గంనుండి తప్పించలేకపోవాలి. అతడు దైవదాస్యాన్ని అంగీకరించిన తర్వాత మరిదేని దాస్యాన్నీ స్వీకరించకపోవాలి. అతడికి అన్ని రకాల సంబంధాలను తెంచుకోవడం సులభం కాగలగాలి. కాని

అతడు తన దైవంతో ఏర్పర్చుకున్న సంబంధాన్ని త్యాగం చెయ్యడం ఏ విధంగానూ సాధ్యపడకూడదు. ఈ ఖుర్బానీయే ఇస్లాం అసలు వాస్తవికత. ఈనాడు ప్రతియుగాన్నీ మించి ఈ వాస్తవం మన గుణగణాల్లో నిక్షిప్తం కావడం అవసరం. ముస్లింలు ఎప్పుడయినా దెబ్బతిన్నారూ అంటే ఇస్లాం యొక్క ఈ వాస్తవికత వారిలో లోపించినప్పుడే.

ఖుర్బానీ పండుగకు మానవ జీవితానికి అవినాభావ సంబంధం ఉంది. మానవుడు భువిలో సామాజిక జీవితం గడపటం ఆరంభించినప్పటి నుండి బహుశా అప్పటి నుండే పండుగ జరుపుకొనే పరంపర నడుస్తూవచ్చింది. సంవత్సరంలో రెండు మూడు లేక ఐదు, పది రోజులు ఇందుకోసం ప్రత్యేకించుకోని జాతి అంటూ ఏదీలేదు, ఉండబోదు. ఈ పండుగలు నిజానికి సమాజానికి ప్రాణం వంటివి. ప్రజలు ఒక చోటకు వచ్చి చేరటం, సమిష్టిగా భావోద్రేకాలను ప్రదర్శించడం, అందరూ కలసి వేడుకలు చేసుకోవడం ఒకే విధమయిన నిర్ణీత ఆచారాలను పాటించడం, ఇదంతా ఒక అంటు కట్టిన స్వభావం కలిగి ఉంటుంది. దాని వల్ల వ్యక్తులు పరస్పరం కలిసి ఒక అనుబంధ సమాజంగా ఏర్పడతారు. వారిలో సామాజిక స్పృహ జనించడమే కాక కొద్ది పాటి విరామాలతో తాజాగా జాగృతమవుతూ ఉంటుంది. సాధారణంగా ప్రపంచంలోని వివిధ దేశాలు, జాతులలో జరుపబడే పండుగల్ని గనక పరిశీలిస్తే ప్రతి పండుగ ఏదైనా ముఖ్యసంఘటన యొక్క స్మరణగా జరుపుకోబడుతుంది, లేక ఎవరయినా గొప్ప వ్యక్తికి సంబంధించినదైనా ఉంటుంది. లేదా ఏదయినా ప్రత్యేక మత వేడుకకు సంబంధించినదైనా ఉంటుంది. మొత్తం మీద పండుగ కోసం ఒక జాతి వ్యక్తులు లేక ఒక దేశ ప్రజల కోసం ఉమ్మడి ఆసక్తి గల విషయం అయి ఉండాలి. దాని పట్ల వారు ప్రగాఢ అనుభూతి కలవారయి ఉండాలి. అందుచేతనే ఒక జాతి జరుపుకునే పండుగలో ఒక దేశం జరుపుకునే వేడుకలు పట్ల మరో జాతి, దేశప్రజలు ఆసక్తి చూపరు. ఏదయినా మర్మంతో,

మొహమాటంతో, ఆసక్తి కనబర్చదలచుకున్నా అలా చేయలేరు. ఎందుకంటే ఒక జాతి పండుగ ఏ ఆచారాలతో సంబంధం కలదయి ఉంటుందో అది మరో జాతికి చెందిన భావావేశాలలో, ఆ జాతిలో కలిగినంతగా, మరో జాతికి ఆసక్తిని పుట్టించలేవు.

పండుగలు జరుపుకునే విధానాలు కూడా ప్రపంచంలోని వివిధ జాతులలో అసంఖ్యాకంగా ఉన్నాయి. ఒక చోట కేవలం ఆటపాటలు,సంతోషం, వినోదం , విహారం వరకే పండుగ పరిమితమవుతుంది. కొన్ని చోట్ల విహార యాత్రలు నాగరికత హద్దులను దాటి, అధర్మం, అసభ్యం హద్దు వరకు చేరు కుంటాయి. కొన్ని చోట్ల సాంస్కృతికమయిన విహారయాత్రలతో పాటు కొన్ని సౌమనస్యపూరిత ఆచారాలు కూడా పాటించబడతాయి. మరికొన్ని చోట్ల అటువంటి సామూహిక వేడుకలతో లబ్ధిపొంది ప్రజలలో ఉన్నత స్థాయి నైతికతకు ఊపిరిపోయడం జరుగుతుంది. ఇంకా ఒక లక్ష్యంతో ప్రేమా ఆపేక్షలు జనింపచేసే ప్రయత్నం జరుగుతుంది. అంటే ఒక జాతి పండుగ జరుపుకొనే విధానం ఒక కొలపాత్రలాంటిది. దానిని బట్టి మీరు ఆ జాతి స్వభావం, ధైర్యసాహసాలు, ఆపేక్షల్ని బహిరంగంగా కొలిచిచూడగలరు. ఒక జాతిలో ఎంతటి ఉత్తమ స్పిరిట్ ఉంటుందో అంతగానే దాని పండుగలు నాగరికంగా, పవిత్రంగా ఉంటాయి. అదే విధంగా ఏదయినా జాతి నైతిక పరంగా ఎంత దిగజారి ఉంటుందో ఆ జాతి తన పండుగల్లో అంతే అసభ్యకర దృశ్యాలను ప్రదర్శిస్తుంది.

★ ★ ★

# ఖుర్బానీ పండుగ

ఇస్లాం ఒక ప్రపంచ వ్యాప్త సంస్కరణా ఉద్యమం. అది ఒక ప్రత్యేక దేశం లేక జాతికి సంబంధించినది కాదు. పైగా ప్రపంచ ప్రజల్ని ఒక దైవ భక్తి గల సంస్కృతిని అవలంబించేవారుగా చేయగోరుతుంది. అందుచేత అది జీవితంలోని ప్రతిరంగాన్నీ తనదైన ప్రత్యేక శైలిలో మలిచింది, అదే విధంగా పండుగలకు ఒక నూతన రూపం ఇచ్చింది. అది ప్రపంచంలోని పండుగలన్నింటి కంటే భిన్నమైన రూపం. సామాజిక జీవితంలో పండుగకు గల ప్రాముఖ్యత ఇంకా సమాజంలో సామూహిక వేడుకలలో ఒక దైవికమయిన తహతహ ఉంటుంది. దాన్నయితే ఇస్లాం చిన్నచూపు చూడలేదు. పైగా దానివల్ల లబ్ధి పొందే పూర్తి ప్రయత్నం చేసింది. అయితే పండుగ సమావేశం పండుగ జరుపుకునే విధానాలు ఇంకా పండుగలోని నైతిక స్ఫూర్తిలో ప్రాథమికమయిన మార్పు కలిగించింది. దానికి సంబంధించి మూడు ముఖ్య ప్రత్యేకతలవైపు మీ శ్రద్ధను మళ్ళిస్తున్నాను. ప్రపంచ వ్యాప్త ఉద్యమం జాతీయ పండుగలను ఆపేక్షకర దృక్కులతో చూడజాలదు. ఏ పండుగల పునాది వేర్వేరు జాతుల ఆచారం ప్రకారం ఉంటే, దానితోపాటు ఒకే జాతి భావావేశాలు, అభిరుచులు అనుబంధమయి ఉంటే, ఇంకా దేనిలోనయితే ఒక జాతితోపాటు మరోజాతి సహజంగానే చేరలేక పోతుంటే, నిజానికి అది మానవత్వం యొక్క జాతి విభజన, వేర్పాటును దృఢపరిచే శక్తి, అవి ఒక జాతిని తమలో సంఘటితం అవడంలో సహాయ పడతాయో, అదే విధంగా ప్రతి జాతినీ మరో జాతితో చీల్చివేరు చేసే సేవను నిర్వర్తిస్తాయి. కాబట్టి ఏదయినా ఇటువంటి ఉద్యమం జాతీయతలకు అతీతంగా మానవత్వంతో చర్చిస్తుంటే ప్రపంచ మానవులను ఒక నాగరికత బంధంలో ఏర్చికూర్చగోరుతూ ఉంటే ఇంకా ఇటువంటి పండుగల్ని అంగీకరించకపోవడమే కాక, సహించనూజాలదు. ఎందుకంటే అవి ఈ లక్ష్య మార్గంలో మొత్తానికి ఒక అడ్డంకి అవుతాయి. అందుచేతనే దృష్టిలో ఉన్న లక్ష్యం సహజంగానే కోరేదేమంటే దాని ప్రభావంలోకి వచ్చిన జాతులతో జాతీయ

పండుగలను మానిపించి, వారందరూ పాల్గొనగల పండుగలను, ఒకే సమయంలో జాతీయమూ, అంతర్జాతీమయులైన పండుగలను నిర్ణయించాలి. వేటి ప్రాతిపదిక జాతీయ ఆచారాలు, ఆసక్తులపై కాకుండా మానవత్వం కోసం ఉమ్మడి ప్రాధాన్యత ఉండే ఆచారాలు, ఆవేశాల ప్రకారం ఉండాలి.

ఇంకా ప్రపంచవ్యాప్త ఉద్యమం కావడంతో పాటు దైవ భీతిగలది కూడా కావాలి. అది ఈ పండుగలను అన్ని వేడుకలను ఏవయితే పురాతన కాలపు జ్ఞాపకాలను తిరిగి గుర్తుచేస్తాయో వాటిని ఆపేయాలి. వాటి స్థానంలో దైవభక్తి అనే ప్రగాఢ రంగుతో వున్న పండుగలను నిర్ణయించాలి.

దైవభక్తితోపాటు తప్పనిసరిగా నైతికత యొక్క ఉన్నత లక్ష్యమూ ఇందులో జనిస్తుంది. అది కోరేదేమంటే దైవభక్తిపూరిత ఉద్యమం తన అనుయాయులకు అధర్మ, అసభ్యతలు బొత్తిగా లేని పండుగ నివ్వాలి. దానిలో వినోదం, విహారం నాగరికంగా సంతోష ప్రకటన సౌమనస్యంతో జరిగే పండుగను ఇవ్వాలి. అది కేవలం ఆటపాటలతో పూర్తిగా నిండిఉండకుండా సామూహిక జీవితంలో పండుగ కారణంగా ఒక కదలిక, చైతన్యం జనిస్తుంది. వాటిని ఉన్నతస్థాయి నైతిక లక్ష్యాల కోసం పూర్తిగా వినియోగించాలి.

ఇస్లాం తన అనుయాయులకు నిర్ణయించిన పండుగల్లో ఈ మూడు ప్రత్యేకతలూ స్పష్టంగా కనబడతాయి. అరేబియా, ఈరాన్, ఈజిప్టు, సిరియా ఇంకా ఇతర దేశాల్లో ఇస్లాం స్వీకరించిన జాతుల మత, జాతీయ పండుగల్ని ఇస్లాం మాన్పించివేసింది. వాటి స్థానంలో రెండు పండుగల్ని చలామణిలోకి తెచ్చింది. అవి ఈదుల్ ఫిత్ర్, బక్రీద్ పండుగలు. ఇందులో మొదటి పండుగ దైవం పేరుతో రమజాన్ మాసంలో ముప్ఫయి రోజులు ఉపవాసం పాటించమని మనకు ఇవ్వబడిన ఆదేశాన్ని పూర్తిచేయడంలో విజయులమయి సంతోషంతో చేయబడుతుంది. కాబట్టి ఈ ఆదేశాన్ని అమలుపర్చడం జరిగిన తర్వాత మనం మన ప్రభువుకు కృతజ్ఞత చెల్లించాలి. ఇక రెండవ పండుగ అయితే నిరుపమాన త్యాగానికి జ్ఞాపిక. అది నాలుగువేల ఏళ్ళ క్రితం దేవునికి విధేయుడయిన దాసుడు తన ప్రభువు సమక్షంలో సమర్పించబడిన త్యాగనిరతి. ఈ రెండు పండుగల్లో మీరు స్పష్టంగా గమనించగలరు. ఏదయినా ప్రత్యేక జాతీయత పట్ల

మొగ్గుచూపడం జరుగలేదు. రెండు విషయాలను పండుగకు ప్రాతిపదికగా చేసుకోవడం జరిగింది. దానితో ప్రపంచంలోని దైవభక్తిపరులయిన మానవు లందరి మనోభావాలు ఒకేవిధంగా అనుబంధమై ఉండగలవు. అదేవిధంగా రెండు పండుగలలో సర్వలోక ప్రభువు దాస్యం ప్రగాఢంగా కనబడుతుంది. ఏదయినా హీరోవర్షిప్‌గానీ, ఏ ప్రాణి ఆరాధనకు అతి స్వల్ప ఉదాహరణగానే మీరు వాటిలో చూడలేరు. ఇంకా ఆ పండుగలు జరుపుకునే నిర్ణీత విధానం కూడా ఎంతో పవిత్రమైనది. దానికంటే పరిశుద్ధమయిన, నాగరికమయిన నైతిక ప్రయోజనాలతో కూడిన విధానం ఊహించనే లేం. తరువాతి కాలపు ముస్లింలు ఇస్లామీ యుగపు అసలు వైభవాన్ని కొంతవరకు అజ్ఞాన చేష్టలతో మచ్చ కల్పించారు. కాని దైవప్రవక్త(స) హయాంలో ఈద్ ఏవిధంగా జరుపుకోబడేదో మీకు వివరిస్తాను. దానినిబట్టి పండుగ పవిత్రతను మీరు సరిగ్గా అంచనా వేయగలరు.

ఈద్ రోజు ఉదయం ముస్లింలందరూ స్త్రీ పురుషులు, పిల్లలు అందరూ గుసుల్‌చేసి ఉన్నవాటిలో మంచి బట్టలు ధరించేవారు. రమజాన్ పండుగనాడు నమాజ్‌కు వెళ్ళేముందు సంపన్నులు అందరూ నిర్ణీత పరిమాణంలో సద్‌ఖా (దానం)గా కొంతమొత్తాన్ని పండుగరోజు ఎవరూ పస్తు ఉండకూడదని పేదలకు పంచేవారు. బక్రీదు పండుగనాడు అందకు భిన్నంగా నమాజ్ తర్వాత ఖుర్బానీ చెయ్యబడేది. కాస్త పొద్దెక్కగానే అందరూ ఇళ్ళనుండి బయలుదేరి నిలబడేవారు. స్త్రీలు, పురుషులు పిల్లలు అందరూ బయలుదేరాలని ఆదేశించబడేది. తద్వారా ముస్లింల అధికసంఖ్య, వారి వైభవం ప్రకటించబడాలని, దైవాన్ని ప్రార్థించడం లోనూ అందరూ పాలుపంచుకోవాలని. సామూహిక సంతోషంలోనూ అందరూ పాల్గొనే అవకాశం కలగాలని. ఈద్ నమాజ్ మస్జిద్‌లో బదులు పెద్దసంఖ్యలో జనం చేరగలిగేందుకు ఊరుబయట మైదానంలో జరిగేది. నమాజ్ కోసం వెళ్ళేటప్పుడు ముస్లింలందరూ తక్బీర్ పఠించేవారు. అల్లాహ్ అక్బర్, అల్లాహు అక్బర్, లా ఇలాహ ఇల్లల్లాహు అల్లాహు అక్బర్, అల్లాహు అక్బర్, వలిల్లాహిల్ హమ్ద్. (అల్లాహ్ అందరికన్నా గొప్పవాడు, అల్లాహ్ అందరికన్నా గొప్పవాడు.

అల్లాహ్ తప్ప ఆరాధ్యుడు ఎవరూ లేరు. అల్లాహ్‌యే అందరికన్నా గొప్పవాడు. సకల స్తోత్రాలూ అల్లాహ్ కొరకే) ప్రతి సందూ, ప్రతి గొందూ ప్రతి బజారు, ప్రతి వీధిలో ఇవే నినాదాలు ప్రతిధ్వనించేవి. ఈద్‌గాహ్ మైదానంలో అందరూ చేరుకున్న తర్వాత బారులు తీరి అందరూ దైవప్రవక్త(స) నాయకత్వం (ఇమామత్)లో సక్రమంగా రెండు రకాతుల నమాజ్ చేసేవారు. తరువాత దైవప్రవక్త(స) నిలబడి ఖుత్బా(ప్రసంగం) ఇచ్చేవారు. జుమా నమాజ్‌కు భిన్నంగా ఈ ఖుత్బా నమాజ్ తర్వాత జరిగేది. ఆవిధంగా అత్యంత అధిక సంఖ్యలో ప్రజలు తమ నాయకుని ముఖ్య ఉపన్యాసం సమయంలో అక్కడ ఉండాలని. ఇటువంటి అవకాశం సంవత్సరంలో కేవలం రెండుసార్లు వస్తుంది. మొదటి ఉపన్యాసం పురుషుల ఎదుట జరగుతుంది. తర్వాత ఆయన(స) మైదానంలో స్త్రీలు ఉన్న భాగంవైపుకు వెళ్ళేవారు. అక్కడ కూడా ప్రసంగించేవారు. ఈ ప్రసంగాలలో బోధన, ప్రోత్సాహం హితబోధతోపాటు ఇస్లామీ సంఘానికి సంబంధించి అప్పట్లో ఉన్న ముఖ్యసమస్యలపై కూడా వెలుగు సారించేవారు. ఏదైనా సైనిక, రాజకీయ ఉద్యమం దృష్టిలోగనక ఉండిఉంటే అందుకు ఏర్పాటు కూడా అక్కడే ఆ సమూహంలోనే జరిగిపోయేవి. జమాఅత్ అవసరాలవైపు కూడా ప్రజలను శ్రద్ధ వహింపచేయడం జరిగేది. ప్రతివ్యక్తి తన తాహతును బట్టి వాటిని పూర్తిచేయడంలో పాలుపంచుకుంటాడు. స్త్రీలు తమ నగలను సయితం జమాఅత్ (సంఘం)కు అర్పించారని ఉల్లేఖనాల ద్వారా తెలుస్తోంది. తర్వాత ఈ సమూహం ఈద్‌గాహ్ నుండి నిష్క్రమించేడివారు. నమాజ్‌కు ఏ దారి గుండా వచ్చారో తిరిగి వెళ్ళేటప్పుడు అదే దారినుండి కాక మరోమార్గం గుండా ఇళ్ళకు మరలాలని ఆదేశించబడింది. అలాచేసినందువల్ల బస్తీలోని ఏ భాగమూ మీ రాకతో, మీ తక్బీర్ల ప్రతిధ్వనితో మారుమ్రోగాలని.

నమాజ్ నుండి వాపసు వచ్చిన తర్వాత బక్రీద్‌నాడు స్తోమత గల ముస్లింలు ఖుర్బానీ చేసేవారు. ఈ ఖుర్బానీ ఉద్దేశ్యం, ఇరాక్ వాసి అయిన ఒక ప్రవాసంలోని వృద్ధుడు మక్కాలో ఉంటూ దేవుని సూచన పొందిన వెంటనే స్వయానా తన కుమారుడ్ని దైవంపట్ల ప్రేమతో ఖుర్బానీ ఇవ్వడానికి సిద్ధపడగా

సరిగ్గా అదే సమయానికి దైవకటాక్షంతో ఆ కుమారుని స్థానంలో పొట్టేలును ఖుర్బానీ ఇవ్వడానికి అనుమతివ్వడం జరిగింది ఈ సంఘటనను తిరిగి జ్ఞాపకం చెయ్యటమే కాక ఆ ఉత్సాహాన్ని నవనవోన్మేషం చెయ్యడానికి, సరిగ్గా అదే తేదీన, అదే సమయంలో ముస్లిలందరూ అదే పనిని, ఆచరణాత్మకంగా చేసి ఆ ఉత్సాహాన్ని తిరిగి పొందుతారు. తామూ హజ్రత్ ఇబ్రాహీంవలె దైవానికి వినమ్రులు, విధేయులమని, ఆయనలాగా తమ ధనప్రాణాలు, సంతానం, ప్రతిదాన్నీ దేవుని ఆదేశం, ఆయన ప్రేమకు అంకితం చెయ్యడానికి సిద్ధం అని తమ జీవన్మరణాలు సమస్తం దైవం కోసమే అని ఆ విశ్వాసానికి పునరంకితం అవుతారు. ఈ సంకల్పం జంతువును జిబహ్ చేసే కర్మతో జిబహ్ చేసేటప్పుడు నోటితో పలికే ఈ పదాలతో ప్రకటితమవుతోంది.

"నేను ఏకాగ్రతతో నా ముఖాన్ని భూమ్యాకాశాల సృష్టికర్త వైపుకు తిప్పుకున్నాను. నేను షిర్క్ (బహుదైవారాధన)కు పాల్పడేవాన్ని ఎంతమాత్రమూ కాదు. నిస్సందేహంగా నా నమాజు, నా ఖుర్బానీ, నా జీవన్మరణాలు సమస్తము సకల లోకాల ప్రభువు అయిన అల్లాహ్ కొరకే. ఆయనకు సహవర్తులు ఎవరూలేరు. ఈ ఆజ్ఞయే నాకు ఇవ్వబడింది. నేను దైవానికి విధేయులయిన దాసులలోని వాణ్ణి, దేవా! ఇది నీ సొమ్మే. నీ కోసమే సిద్ధంగా ఉంది. గొప్పవాడయిన అల్లాహ్ పేరుతో." ఈ పదాలను నోటితో పలుకుతూ, జంతువును జిబహ్ చేయడం జరుగుతుంది. ఈ దృశ్యాన్ని ఇంటిలోని స్త్రీలు, పిల్లలూ అందరూ చూసేవారు. తద్వారా అందరి హృదయాలలో అదే ఖుర్బానీ, దైవానికి అదే విధేయతల స్ఫూర్తి తాజా కావటానికి. తర్వాత ఈ మాంసం పేదలకు, బంధువులకు పంచబడేది. జంతువు చర్మం లేక దాని విలువ పేదలకు ఇవ్వబడేది. అంతేకాక మనస్ఫూర్తిగా దానాలు చెయ్యబడేవి. ఆవిధంగా పండుగ అనేది కేవలం ధనవంతుల పండుగగా మిగిలిపోకూడదని.

దైవప్రవక్త(స) కాలంలో జరుపబడే పండుగ ఇది. "ఈ అధికారపరమైన ఆచారాలు" మాత్రమేకాక అనధికారికంగా కూడా వారు ఆటపాటలు కూడా జరుపుకునేవారు. ఇళ్ళలోని బాలికలు కలిసి కూర్చుని కొన్ని గీతాలు కూడా పాడుకునేవారు. అయితే ఇవి ఒక హద్దులోపల జరిగేవి. అంతకుమించి అడుగు

ముందుకు వేసే అనుమతి లేదు. పైగా సమాజంలోని నాయకులయితే యువజనులు ఇటువంటి జాయెజ్ సంబరాల్లో పాలుపంచుకోవడాన్ని కూడా నిరసించేవారు. ఆవిధంగా వారికి ప్రోత్సాహం లభించకూడదని, దానితోవారు అసభ్యకర ప్రదర్శనలు చేసేధైర్యం వారికి కలగకూడదని. లీడర్ల ఆచరణా ధోరణి ఈ సంఘటనతో అంచనా వేయవచ్చు. అది ముస్నద్ ఉల్లేఖనాల్లో వివరించబడింది. ఒకసారి ఈద్ రోజు దైవప్రవక్త(స) తన ఇంటిలో ప్రవేశించగానే హజ్రత్ ఆయిషా(రజి) వద్ద పొరుగువారయిన ఇద్దరు బాలికలు కూర్చుని గీతాలు ఆలపిస్తుండటం చూశారు. గీతాలు ప్రేమ, సారాయి సీకుల టాపిక్‌కు చెందినవి కావు. పైగా బగాస్ యుద్ధకాలం నాటి గీతాలు. బాలికలు కూడా వృత్తిరీత్యా కళాకారులు, సంగీతకారులు కాదు. ఇళ్ళలోని కూతుళ్ళు, కోడళ్ళు. మనోరంజనం కోసం వీరు కలిసి కూర్చుని అమాయక గీతాలు పాడుకునేవారు. దైవప్రవక్త(స) వారి ఈ విహారంలో జోక్యం చేసుకోలేదు. మౌనంగా ఒక మూల దుప్పటి కప్పుకొని పరుండిపోయారు. కొంతసేపయిన తర్వాత హజ్రత్ అబూబకర్(రజి) ఇంటికి వచ్చారు. ఆయన తన కుమార్తెతో దైవప్రవక్త(స) ఇంట్లో ఇవేమీ షైతానీ చేష్టలు జరుగుతున్నాయి అంటూ గద్దించారు. ఆయన గొంతు విని దైవప్రవక్త(స) ముఖం నుండి దుప్పటి తప్పించి అన్నారు. "ఉండనియ్యి" ప్రతి జాతికీ ఒక పండుగ ఉంటుంది. ఈ రోజు మన పండుగ.

దైవప్రవక్త(స) ఈ ఆదేశాన్ని విని హజ్రత్ అబూబకర్(రజి) మౌనం దాల్చారు. అయితే ఆ గీతాల పరంపర కొనసాగింపబడలేదు. ఆయన వీపు తిప్పుకోగానే హజ్రత్ ఆయిషా (రజి) ఆ బాలికలకు కంటితో సైగచేశారు. వారు తమ ఇళ్ళకు పరుగుతీశారు. ఈ సంఘటనను బట్టి యువజనుల అమాయకమైన ఆటపాటలు, ఒకింత పాడుకుని వాద్యాన్ని వాయించడం ధర్మసమ్మతంగా ఉన్నప్పటికీ పెద్దలు ఇటువంటి ఆహ్లాదాల్లో పాల్గొని వారిని ప్రోత్సహించేవారు కాదు అని తెలుస్తోంది. తర్వాత పెద్దలు హద్దులను కంటకనిపెట్టడం మానివేయగా ఆ విషయంలో సడలింపు జరుగుతూ పోయి చివరకు నాట్యాలు, రంగులు జల్లుకోవడం దాటుకుని వ్యవహారం అసభ్య గీతాల వరకూ వెళ్ళింది.

- : సమాప్తం :-